## క్లుప్తంగా

### సేద తీరిన ప్రజలు



రమణయ్యపేటలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

**కాకినాడ రూరల్:** వర్షాకాలంలో వేసవిని తలపించేలా ఎండలు మండడంతో అల్లాడిన ప్రజలు గురువారం సేద తీరారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తీరం వెంబడి బలమైన గాలులు వీయడంతో కాకినాడలో గురువారం చలిగాలులు ప్రభావం చూపాయి. రోజంతా చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. వర్షం వల్ల జన జీవనం స్తంభించగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాగు నీటి ఎద్దడితో ఉన్న రైతులకు వర్షం మేలు చేయనుంది. నేల చదును తేరడంతో ఖరీఫ్ పనులకు వర్షం ఉపయోగంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

### ఆర్మీ ర్యాలీకి రూ.1.1 లక్షల విరాళం

**బోట్‌క్లబ్:** కాకినాడలో వచ్చే నెలలో జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్ నిర్వాహణకు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ జిల్లా శాఖ రూ.1,10,116 విరాళం అందజేసింది. ఈ మేరకు గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.త్రినాథరావు, కార్యదర్శి వి.జితేంద్ర, కలెక్టరేట్ ఏవో ఎస్.రామ్మోహన్ కలెక్టర్ షణ్మోహన్‌కు చెక్కును అందజేశారు.

### ఘనంగా అయ్యంకి జయంతి



అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

**బాలాజీచెరువు:** గాంధీనగర్ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ 135వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత డిప్యూటీ లైబ్రేరియన్ సలాది సాయి సత్యనారాయణ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయుర్వేద ప్రకృతివైద్యంలో సిద్ధహస్తులుగా పేరొంది గ్రంథాలయ సర్వస్వం అనే పత్రిక నిర్వహించారన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో విశేష కృషి చేసి గ్రంథాలయ పితామహుడిగా పేరొందారన్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొంకుదురులో జన్మించి గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేశారన్నారు. అనంతరం పాఠకులకు ఆయన జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, పాఠకులు పాల్గొన్నారు.

### అపర భగీరథుడు కాటన్

**కాకినాడ రూరల్:** ఉభయ గోదావరి జిల్లాలకు సాగు నీరు అందించిన అపర భగీరథుడు కాటన్ దొర వర్ధంతిని పురస్కరించుకుని రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ఆయనకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

**బోట్‌క్లబ్:** స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా గురువారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తకంగా నిర్వహించారు. కంకణధారణ, పాదప్రక్షాళన, వస్త్ర సమర్పణ, జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ వంటి ఘట్టాలు కనుల పండుగగా నిర్వహించారు. 108 వెండి తులసీ దళాలతో స్వామి వారికి అర్చన వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారి యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# దోమల దండయాత్ర

- ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త, పిచ్చి మొక్కలు
- అంతకంతకూ పెరిగిపోతున్న ఉత్పత్తి
- డెంగీ, మలేరియా జ్వరాలతో జనంలో భయం



గాంధీనగరంలో ఖాళీ స్థలంలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

**నాగమల్లితోట జంక్షన్:** ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు దండయాత్ర చేస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణను కార్పొరేషన్ అధికారులు విస్మరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆయిల్ బాల్స్ డ్రైయిన్లలో వేయడం లేదు. ప్రైవేట్ స్థలాలు పొదలుగా మారినా శుభ్రం చేయించడం లేదు. దోమ జీవిత కాలం 8 రోజులు. దోమ కుడితే మాత్రం రకరకాల జబ్బులు జీవితకాలం వేధిస్తుంటాయి. ఆడ ఎనాఫిలస్ దోమ కుడితే మలేరియా, పగటి పూట టైగర్ దోమ కుడితే డెంగీ, ఈడిస్ దోమ కుడితే చికున్ గున్యా, సాల్మనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా వల్ల టైఫాయిడ్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ భయంతో గృహస్తులు తమ ఇంటి బడ్జెట్‌లో దోమల నివారణకు ప్రత్యేక కేటాయింపులు చేస్తున్నారు. రోజుకు సరాసరి పది రూపాయలు చొప్పున నెలకు రూ.300, సంవత్సరానికి రూ.3600 ఇందుకు ఖర్చుచేస్తున్నారు. దోమల నివారణకు వాడే అగరబత్తి, కాయిల్స్, మ్యాట్లు, లిక్విడ్స్, పేపర్లు వంటి వాటి కోసం ఖర్చు చేస్తున్నారు. దోమలు కుట్టడం వల్ల సంక్రమించే వ్యాధులు తగ్గించుకోవడం కోసం వైద్యానికి చేసే అదనపు ఖర్చు చేర్చితే మరింత మొత్తం ఆ వ్యయానికి జమవుతుంది. నగరంలో ఉన్న వార్డుల్లో ఖాళీ జాగాలలో వాననీరు సక్రమంగా వెళ్లే మార్గాలు పూర్తిస్థాయిలో లేకపోడంతో డ్రైన్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, కొబ్బరి బొండాలు దోమల ఉత్పత్తికి చిరునామాగా మారుతున్నాయి.

**ఫాగింగ్ అంతంత మాత్రమే...**

నగరంలో దోమల నివారణకు చేపట్టే ఫాగింగ్ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్ బంగ్లా, తదితర



అయ్యర్ హోటల్ సమీపంలో చెత్త, పిచ్చి మొక్కలతో నిండిపోయిన ఖాళీ స్థలం

ప్రాంతాల్లో నిత్యం క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తూ వార్డుల్లో అంతంత మాత్రంగా చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో గాంధీనగర్, రామారావు పేట, కచ్చేరి పేట, ఇంద్రపాలెం, అచ్యుతాపురం, సాంబమూర్తి నగర్, శశికాంత్ నగర్, స్వామి నగర్, దుమ్ముల పేట, జగన్నాథపురం, రేచర్ల పేట, శ్రీనగర్, సురేష్ నగర్, స్టేడియం పరిసర ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు భయభ్రాంతులకు గురువుతున్నారు. ఏ దోమ కుడితే ఏ వ్యాధి బారిన పడాల్సి వస్తుందో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### వ్యాధుల భయం తప్పడం లేదు



నగరంలో దోమలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. చిన్న పిల్లలకు ఏ దోమ కుడితే ఏ వ్యాధి బారిన పడాల్సివస్తుందో అని భయంగా ఉంది. అటు పక్క కార్పొరేషన్ సిబ్బంది దోమల నివారణకు చేయాల్సిన ఫాగింగ్ కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– రమణారావు, రేచర్లపేట

### పారిశుధ్యం అంతంత మాత్రమే



నగరంలో ఖాళీ స్థలాలు మొక్కలతో నిండిపోవడం, పారిశుధ్యం అతంత మాత్రంగా ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కుడుతున్నాయి. మలేరియా, డెంగీ వ్యాధులు వస్తాయేమో అని భయంతో బతకాల్సి వస్తోంది.

– మణిరత్నం, అచ్యుతాపురం

### శిష్యులే నా బలం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

**బోట్‌క్లబ్:** శిష్యులే నా బలమని సంగీత సేవ స్వర రాగసుధ సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి అన్నారు. స్థానిక సూర్యకళామందిరంలో గురువారం సంగీత విద్యాలయం 25వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనను సత్కరించి స్వర్ణ కంకణం, గండ పెండేరం బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ గాత్రంతో అందరినీ ఆకట్టుకున్నారు. తురగా వెంకట శేష సాహితి, తురగా సూర్య అపర్ణ సౌమ్య తమ గాత్రంలో సభికులను ఉత్తేజపరిచారు. తన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం తురగా సూర్యారావు, శేషుకుమారి దంపతులు శ్రీరామ చంద్రమూర్తిని సత్కరించారు.

### పాఠశాలకు కుర్చీల బహూకరణ

**బాలాజీచెరువు:** స్థానిక సాంబమూర్తినగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలకు దాత శ్రీవిద్య కుర్చీలు బహుకరించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన మేగా పేరెంట్స్ మీట్‌లో ఉపాధ్యాయులకు సరైన కుర్చీలు లేకపోవడాన్ని గమనించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మీకు 8 కుర్చీలు అందజేశారు.

# స్మార్ట్ మీటర్లపై అపోహలు వద్దు

- బిల్లుకు అదనపు చార్జీలు ఉండవు
- వినియోగం, బిల్లు నియంత్రణ వినియోగదారుల చేతుల్లోనే
- ఈపీ డీసీఎల్ ఎస్‌ఈ ప్రసాద్

**బాలాజీచెరువు:** విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.ప్రసాద్ స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సేవలలో పారదర్శకతను మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాలలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందన్నారు. అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లతో మార్చాలనే ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీ ఈఆర్సీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఏపీ ఈఆర్సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామని చెప్పారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా అమర్చుతున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

**ఎలాంటి అదనపు చార్జీలు ఉండవు**

స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదుకానీ, చార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించాల్సిన అవసరం లేదని ఎస్ఈ తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ బిల్లుతో పాటు నెలవారీగా ఎటువంటి ఈఎంఐలు వసూలు చేయబోమని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి వల్ల బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**టారిఫ్ ప్రకారమే బిల్లులు**

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని ఎస్ఈ పేర్కొన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్‌కు వెళ్తాయన్నారు. ఈ–బిల్‌లో వినియోగదారులు వినియోగించిన యూనిట్లు, వాటికి చెల్లించాల్సిన చార్జీలు తదితర వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు సందేహాల నివృత్తికి వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించవచ్చని ఎస్ఈ ప్రసాద్ తెలిపారు.

### హిందూ యాత్రికులకు ఆర్థిక సాయం చేయాలి



లేఖను చూపుతున్న నగర గణేశ ఉత్సవ కమిటీ సభ్యులు

**బోట్‌క్లబ్:** హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లిం మైనారిటీలకు ఇస్తున్నట్లే కైలాస మానస సరోవర యాత్రకు వెళ్తున్న హిందూ యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని నగర గణేశ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి లేఖలు రాసినట్లు చెప్పారు. స్థానిక గణేశ ఉత్సవ సమితి కార్యాలయంలో సమితి కార్యవర్గ సమావేశాన్ని గురువారం జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఇప్పటికే మానస సరోవర్ యాత్రకు వెళుతున్న హిందూ భక్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్న విషయాన్ని లేఖలో పొందుపరిచారు. అలాగే వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని వినాయక పందిళ్లకు ఉచితంగా విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు పందిరి నిర్వాహకులు సమీప ఇళ్ల నుంచి విద్యుత్‌ను తీసుకునేవారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు విద్యుత్ వినియోగానికి ముడి పెట్టడంతో ఇళ్ల నుంచి విద్యుత్ ఇచ్చేందుకు ఎవరు ముందుకు రావడం లేదన్నారు. కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, దూసర్లపూడి రమణరాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, రంబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సాగుతో మానవుల మనుగడ

- జేడీఏ విజయకుమార్
- నడకుదురులో శిక్షణ తరగతులు ప్రారంభం



నడకుదురులో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతపై మాట్లాడుతున్న జేడీఏ విజయ్‌కుమార్

**కరప:** ప్రకృతి వ్యవసాయంతోనే మానవుల మనుగడ ముడిపడి ఉందని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. దేశంలో నెలకొన్న ఆహార కొరతను అధిగమించేందుకు హరిత విప్లవం ద్వారా రసాయనికి ఎరువులు, పురుగుమందుల వాడకం రైతులకు అలవాటు చేసినట్టు తెలిపారు. ఎకరాకు 10 బస్తాలు కూడా పండని భూముల్లో గ్రీన్ రివల్యూషన్ ద్వారా 40 బస్తాలకు పైబడి దిగుబడులు సాధించి, ఆహార కొరతను సాధించగలిగామన్నారు. మండలం నడకుదురులోని రైతు సేవాకేంద్రంలో గురువారం కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల వ్యవసాయాధికారులు, ఏఈఓలు, వీపీఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఏడీఏ కె.బాబూరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేడీఏ విజయ్‌కుమార్ మాట్లాడారు. హరిత విప్లవంతో అధిక దిగుబడులు సాధిస్తున్నా, రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల భూమిలో ఉండే సూక్ష్మజీవులు, శిలీంద్రాలు, ఉపయోగకరమైన బ్యాక్టీరియా రసాయనిక మందుల ప్రభావానికి చనిపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. మొక్క వినియోగించుకోని రసాయనిక ఎరువుల అవశేషాలు భూమిలో కలవక, నేల సారం కోల్పోయి, నేల భౌతికస్థితికి భంగంవాటిల్లి భూమి నిర్జీవమైపోతోందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయానికి కూడా ప్రాధాన్యం నివ్వాలని జేడీఏ సూచించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రదర్శించి, అందరికీ అవగాహన కల్పించారు. కరప, కాజులూరు, తాళ్లరేవు ఎంఏఓలు ఇమ్మిడిశెట్టి సత్య, అశోక్, ప్రశాంతి, ఏఈఓలు నోవా, బి.శ్రీరాములు, ప్రశాంత్, శ్రీనివాస్, గౌతమ్, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ధనలక్ష్మి, ఎన్ఎఫ్ఏ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**కాకినాడ రూరల్:** ఏడీబీ రోడ్డును ఆనుకుని కొత్తగా విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం తిమ్మాపురం, రమణయ్యపేట గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అచ్చంపేట జంక్షన్, రాయుడుపాలెం, కొత్తూరు జంక్షన్లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**జగన్నాథపురం ప్రాంతంలో..**

**బాలాజీచెరువు:** విద్యుత్ కొత్తలైన్ల నిర్మాణాలకు సంబంధించి శుక్రవారం జగన్నాథపురం ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉదయభాస్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జె.రామారావుపేట, కదారివారి వీధి, కోమలి వారి వీధి, ముగ్గపేట, పాస్టర్ పేట, మునసబుగారి జంక్షన్, నేతాజీ పార్క్, శివాలయం వీధి, దుర్గాప్రసాద్ స్కూల్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

### శాకంబరిగా అన్నపూర్ణాదేవి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**బోట్‌క్లబ్:** ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గురువారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారి ఆలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. భక్తుల సహకారంతో ఆలయ పరిసరాలను కూడా కూరగాయలతో అలంకరించారు. అమ్మవారి అధిక సంఖ్యలో భక్తులుల దర్శించుకున్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడల్లో రంగరాయ విద్యార్థినుల ప్రతిభ

- చెస్‌లో ప్రథమస్థానం కైవసం
- బ్యాడ్మింటన్‌లో ద్వితీయం
- వాలీబాల్‌లో తృతీయస్థానం





వాలీబాల్ విజేతలతో వర్సిటీ అధికారులు

**కాకినాడ క్రైం:** రాష్ట్ర స్థాయి మహిళా క్రీడా పోటీలలో రంగరాయ వైద్య కళాశాల విద్యార్థినులు అదరగొట్టారు. ఈ నెల 22 నుంచి 24 వరకు రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జరిగిన డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రాష్ట్ర స్థాయి ఇంటర్ మెడికల్ విమెన్ టోర్నమెంట్‌లో రంగరాయ విద్యార్థినులు ప్రతిభ కనబరచారు. టోర్నీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా జీఎస్ఎల్ మెడికల్ కళాశాల చైర్మన్ గన్ని భాస్కరరావు వ్యవహరించగా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 మెడికల్, డెంటల్ కళాశాలలకు చెందిన 560 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. విజేతలను ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అభినందించారు. ఆయనతో పాటు ఆర్ఎంసీ స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీఎస్ ముఖర్జీ, పీడీ గొల్లపల్లి లక్ష్మణరావు విద్యార్థినులకు ప్రోత్సాహాన్ని అందజేశారు. చెస్‌లో షేక్ రఫియా, డి.అనసూయ, డి.అమూల్య, వి.ప్రవల్లిక ప్రథమస్థానంలో నిలవగా, బ్యాడ్మింటన్‌లో మజ్జి తేజస్వి, మజ్జి మౌనిక, చొప్పల నిహారి, కోసూరి శ్రీ హల్లిక, ఏ.మేఘన ద్వితీయస్థానంలో, వాలీబాల్‌లో ఐ.మేరీ మెర్సిబా, రాంపల్లి అలివేణి, పి.సాధన, కె.నాగశ్రీవల్లి, ఆర్.ప్రియాంక, నిఖిత కత్రి, ముచ్చెర్ల నందిని, విశ్వంశెట్టి రేఖ, స్వాతి బొంగి, జి.నమిత, జి.సౌమ్య, ఆర్. హైందవి మధుమణి తృతీయస్థానంలో నిలిచారు.

### సామూహిక వ్రతాలు రెండు వారాలకే పరిమితం

- భీమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 1, 15 తేదీల్లో నిర్వహణ



సామర్లకోటలోని బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం

**సామర్లకోట:** పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు రెండు వారాలకే పరిమితం చేశారు. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. దీంతో తొలి శుక్రవారం నుంచి ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలు చేసుకుని, రెండో శుక్రవారం మినహా.. మిగిలిన శుక్రవారాలు పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు జరిగేవి. బుధవారం ఆలయంలో శాకంబరి అలంకరణ, సారె–చీర, లక్ష పసుపు కొమ్ముల నోము జరగడం వల్ల శుక్రవారం సామూహిక వ్రతాలు చేయడానికి సమయం ఉండదని అధికారులు రద్దు చేశారు. వచ్చే నెల ఒకటి, 15వ తేదీ శుక్రవారాల్లో మాత్రమే ఆలయంలో సామూహిక వ్రతాలు చేయాలని నిర్ణయించారు. 8వ తేదీన మహిళలు ఇళ్ల వద్ద సామూహిక వ్రతాలు చేసుకోవడంతో, ఇక్కడ నిర్వహించడం లేదని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. 22వ తేదీన అమావాస్యను పురస్కరించుకుని ఏర్పాట్లు చేయడం లేదన్నారు. దాంతో ఈ ఏడాది రెండు వారాలు మాత్రమే సామూహిక వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏడాది లాగే వ్రతాలకు కావాల్సిన తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరికాయలు, అరటి పండ్లు, గాజులు, ప్లేట్లు, పూలు, లక్ష్మీదేవి ఫొటోను ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారన్నారు. వరలక్ష్మీ వ్రతాలకు వచ్చే మహిళలు ఒకటిన్నర కేజీల బియ్యం, కలశ చెంబు, బ్లౌజ్ మాత్రమే తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుము చెల్లిస్తారని తెలిపారు. సామూహిక వ్రతాల్లో పాల్గొనే మహిళలు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులకు బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేస్తారని ఈఓ చెప్పారు.

# భక్తిశ్రద్ధలతో మడుగులమ్మ జాతర



ప్రత్యేక వాహనంలో అమ్మవారు



జాతరలో ఆకట్టుకున్న గరగ నృత్యాలు

**సామర్లకోట:** పంచారామ క్షేత్రం సమీపంలో వేంచేసి ఉన్న మడుగులమ్మ జాతర గురువారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఏటా ఆషాఢ మాసం చివరి అమావాస్య రోజున జాతర ఉత్సవాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయ కమిటీ నాయకుడు వల్లూరి దొరబాబు ఆధ్వర్యంలో జాతర నిర్వహించగా, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పూలతోను, విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనంపై ఊరేగించారు. బాణసంచా కాల్పులు, బ్యాండ్‌మేళం, శక్తి వేషాలు, గరగ నృత్యాలు, డప్పు, కోయ డ్యాన్సులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఊరేగింపు ఆలయం నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా గాంధీచౌక్‌కు చేరింది. అక్కడ మహిళలు ఊరేగింపునకు స్వాగతం పలికి, అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షం కురుస్తున్నా మొక్కులు తీర్చుకున్నారు. గాంధీచౌక్ నుంచి పెద్ద వీధి, గొల్లగూడెం, నీలమ్మ చెరువు, మఠం సెంటర్, కొత్తూరు మీదుగా ఊరేగింపు తిరిగి రాత్రికి ఆలయానికి చేరింది. రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, సొసైటీ అధ్యక్షుడు పైబి శ్రీనివాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, వల్లూరి వెంకటరమణ, పడాల పుత్రయ్య భక్తులకు సేవలందించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

### అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

- లాడ్జీల యజమానులతో డీఎస్పీ శ్రీహరిరాజు

**సామర్లకోట:** పట్టణ పరిధిలో ఉన్న లాడ్జీల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ డి.శ్రీహరిరాజు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పట్టణంలోని 15 లాడ్జీల యజమానులతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలకు లాడ్జీల నిర్వాహకులు సహకరించాలన్నారు. లాడ్జీల్లో మద్యం సేవించడం, వ్యభిచారం, గంజాయి, గుట్కా బ్యాచ్‌లు రూముల్లో దిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. లాడ్జీల నిర్వాహకులు తప్పనిసరిగా రికార్డులను నిర్వహించాలన్నారు. రూముల్లో దిగిన వారి వివరాలు పూర్తిగా ఉండాలని, ఆధార్ జిరాక్స్ తీసుకోవాలని సూచించారు. ఆదాయం కోసం లాడ్జీల నిర్వాహకులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారికి రూములు ఇస్తే.. నిర్వాహకులపైనా చర్యలు తప్పవన్నారు. సామర్లకోటలో రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ ఒకే ప్రదేశంలో ఉండడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే బ్యాచ్‌లు రూముల కోసం వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ, నేరాల అదుపునకు సహకరించాలని కోరారు. లాడ్జీలను తరుచూ తనిఖీలు చేస్తామని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రైనీ డీఎస్పీ జీవన, సీఐ ఎ.కృష్ణభగవాన్ పాల్గొన్నారు.